



మహా బతుకమ్మ వద్ద మహిళల సందడి



బతుకమ్మను తీసుకొస్తున్న యువతి

బతుకమ్మ సంబరం

ఒక్కేసి పువ్వేసి చందమామ.. అంటూ మహిళలు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అందంగా అలంకరించిన బతుకమ్మ బృందాలకు నగదు బహుమతులు అందజేసి అభినందించారు. సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్‌కుమార్ ఖత్రి, గెడం మాధవ్, ఉపాధ్యక్షులు రేణికుంట రవీందర్, గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, కోశాధికారి పడకంటి సూర్యకాంత్, మహిళా ప్రతినిధులు రేణికుంట రవీందర్, శశికళ చౌహాన్ తదితరులు ఉన్నారు.

- ఈనాడు, ఆదిలాబాద్, - న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం

ఎల్ఆర్ఎస్, ధరణిపై సమీక్ష



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : కుటుంబ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, ఎల్ఆర్ఎస్, ధరణిలపై కలెక్టరేట్‌లో పాలనాధికారి రాజర్షిషా సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నెలాఖరులోగా పరిష్కరించాలన్నారు. ప్రతి రోజు ఆయా బృందాల సందర్శనను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. దరఖాస్తుదారులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. ధరణిలో పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆర్డీవో వినోద్‌కుమార్, డీపీవో శ్రీలత, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. సన్న రకాలు సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో సన్నరకాలు, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సన్న రకాలను గుర్తించేందుకు ఈ సీజన్‌లో సాంకేతికతను వినియోగించుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్న రకాల సాగు ఎక్కువగా ఉండటంతో ధాన్యం సేకరణకు అవసరమయ్యే కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు.




సన్నాల కొనుగోలులో సాంకేతికత

- ప్రత్యేక పరికరంతో గుర్తింపు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

సన్న రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించడంతో వాటి సేకరణలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. నాణ్యతతో పాటు సన్నరకాలను సాగు చేసే రైతుల నుంచి ధాన్యం గుర్తించేందుకు సాంకేతికతను పాటించనున్నారు. ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను సన్నాలుగా గుర్తించింది. జిల్లాల వారీగా అక్కడి నేల, వాతావరణం, సాగు నీటి సౌకర్యం తదితర వాటి మేరకు మంచిర్యాల జిల్లాలో 1008, సాయిరాం, చిట్టిపొట్టి రకాలు, నిర్మల్ జిల్లాలో జైశ్రీరాం, సూపర్‌అమాన్, హెచ్ఎంటి రకాలు సాగు చేస్తుండగా, కుమురం భీం జిల్లాలో శ్రీ101, జైశ్రీరాం, ఆర్ఎన్ఆర్ రకాలు సాగు చేస్తున్నారు. వీటిని గుర్తించేందుకు ఈ సీజన్‌లో గ్రెయిన్‌కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను ఉపయోగించనున్నారు. కేంద్రానికి రెండు పరికరాల చొప్పున ఇవ్వనున్నారు. ఈ యంత్రంతో గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తారు. ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నా.. కొనుగోలు చేసిన తర్వాత సంచులను సులువుగా గుర్తించేందుకు సన్నాల సంచులను ఎరుపు, దొడ్డురకాలను ఆకుపచ్చ దారంతో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.




గ్రెయిన్‌కాలిపర్

నిర్ధారణే సమస్య

వరి ధాన్యం సేకరణలో సన్నధాన్యం నిర్ధారణే సమస్యగా ఉంది. నిబంధనల మేరకు బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 2 మి.మీలకు మించకుండా, పొడవు, వెడల్పు నిష్పత్తి, 2.5 కన్నా ఎక్కువ ఉండే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నాణ్యత పరీక్ష కోసం పొట్టు తీసిన గింజలను తేమ శాతం 17 శాతం కన్నా తక్కువ ఉన్న పరిస్థితుల్లోనే నిర్ధారించాలి. ఇప్పటి వరకు కేంద్రం ఏ, బీ రకాలంటూ మద్దతు ధరలను ప్రకటించింది. సన్న రకాలను ప్రభుత్వం సేకరించేది కాదు. మార్కెట్లో ధర తక్కువగా ఉంటే దొడ్డు రకాల మాదిరిగానే సన్న రకాలను రైతులు విక్రయించుకునే పరిస్థితి ఉండేది. ఈ సీజన్‌లో తొలిసారి సన్నరకాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ఏర్పాట్లపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆటే శ్వాస.. ధ్యాస!



- రంజీ ట్రోఫీ పోటీలకు హిమతేజ ఎంపిక
- ఉమ్మడి జిల్లా నుంచి అవకాశం దక్కించుకున్న తొలి క్రికెటర్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

ఈ కాలం కుర్రాళ్లంటే స్మార్ట్‌ఫోన్లు, సరదాలు, స్నేహితులు, షికార్లు ఉంటాయి. కానీ ఆ యువకుడికి మాత్రం మైదానమే లోకం. క్రికెట్ బ్యాట్, బాల్, స్టంప్స్, గ్లౌజ్స్, అతడి నేస్తాలు. ఆస్వాదించే వయసులో అన్నింటిని వదిలేసి.. లక్ష్యం వైపే ఏకాగ్రతను కేంద్రీకరించాడు. 12 ఏళ్లు మైదానంలో శ్రమించి కలను నిజం చేసుకున్నాడు. బీసీసీఐ నిర్వహించే అత్యంత ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ జట్టు సభ్యుడిగా శుక్రవారం జింఖానా మైదానం(హైదరాబాద్)లో అరంగేట్రం చేయనున్నాడు. అతడే కొడిమెల హిమతేజ. కష్టపడితే ఏ రంగంలోనైనా విజయం వరిస్తుందని నిరూపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

క్రికెట్ మెరుపుల్లో కొన్ని...

- 2012లో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 6 మ్యాచుల్లో 278 పరుగులు.
- 2012లో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 6 మ్యాచుల్లో 278 పరుగులు.
- 2013లో కశ్మీర్‌లో అండర్-14 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో మూడు అర్ధ సెంచరీలు.
- 2017లో అండర్-16, 2019లో అండర్-19 హెచ్‌సీఏ పోటీల్లో పరుగుల వర్షం కురిపించాడు.
- 2023లో అండర్-23 సీకే.నాయుడు స్మారక పోటీలకు హైదరాబాద్ జట్టు సారథిగా ఎంపిక. పోటీల్లో అత్యధిక పరుగులు చేసి నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) గుజరాత్ శిక్షణ శిబిరానికి ఎంపిక.
- 2023లో హెచ్‌జీఏ - న్యూజిలాండ్-ఎ జట్ల పోరులో 49 బంతుల్లో 85 పరుగులు.
- 2024లో బుచ్చిబాబు స్మారక పోటీల్లో ప్రతిభ కనబరిచి రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపిక.

చదువులో, క్రికెట్‌లో మేటి..

ఆదిలాబాద్‌కు చెందిన కొడిమెల మధుసూదన్-కామేశ్వరి దంపతుల కుమారుడు హిమతేజ. చిన్నప్పటి నుంచి చదువులో, క్రికెట్‌లో మేటి. పది, ఇంటర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యాడు. బాబాయ్ వేణుతో కలిసి గల్లీలో ఎడమచేతితో ఆడడం, గంటల తరబడి ఔట్ కాకుండా ఉండటంతో ఆయనను జేసీ క్రికెట్ అకాడమీలో చేర్పించారు. సరైన వసతులు లేకున్నా సాధన చేశాడు. ఉమ్మడి జిల్లా నుంచి రంజీ ట్రోఫీ పోటీలకు తొలి క్రికెటర్‌గా ఎంపికయ్యాడు.

ఈ ప్రయాణంలో ఎన్నింటినో త్యాగం చేశాడు

- మధుసూదన్-కామేశ్వరి, తల్లిదండ్రులు

హిమతేజ రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపికైనందుకు చాలా గర్వంగా ఉంది. కష్టపడిన దానికి ఫలితం దక్కింది. ఈ క్రికెట్ ప్రయాణంలో మా బాబు ఎన్నింటినో త్యాగం చేశాడు. మేము మా బాబుతో గడిపింది చాలా తక్కువే. క్రీడా భవిష్యత్తు గురించి ఆలోచించి ప్రోత్సహించాం. ఎప్పుడూ చూసినా మైదానంలో సాధన చేసే హిమతేజను కలవాలంటే రాత్రి వేళల్లో మాత్రమే సాధ్యమయ్యేది. అది కూడా రెండు గంటలే మాట్లాడుకునేవాళ్లం.

భారత జట్టుకు ఆడటమే నా కల..

- హిమతేజ

రంజీ ట్రోఫీ పోటీలకు హైదరాబాద్ జట్టుకు ఎంపిక అయ్యానన్న విషయం ఇప్పటికీ కలగానే అనిపిస్తుంది. ఇదే స్ఫూర్తిని కనబరిచి రంజీ ట్రోఫీ పోటీల్లో రాణిస్తా. భారత జట్టుకు ఎంపికే లక్ష్యంగా పెట్టుకున్నా. రంజీకి ఎంపిక కావడంతో ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కింది.



మాట్లాడుతున్న వక్త దేవేందర్

దేశహితమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) దేశ హితం కోసమే పని చేస్తుందని అఖిల భారతీయ సహసంఘటన మంత్రి, హిందూ జాగరణ మంచ్(హిందూ వాహిని) పెడబల్లె దేవేందర్ అన్నారు. విజయదశమి ఉత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం పథ సంచలన్ నిర్వహించారు. ప్రధాన కూడళ్ల మీదుగా సాగిన ఈ పథ సంచలన్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. అనంతరం డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆనాడు స్వయం సేవకులు అంకితభావంతో పని చేసి ఆత్మబలిదానాలు చేసుకున్నారని, వారి విజయగాథలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. యుద్ధాలు, ప్రకృతి విపత్తుల వేళ ఆర్ఎస్ఎస్ అందరికంటే ముందుండి సేవలు అందిస్తుందన్నారు. ఎంపీ గోడం నగేష్, ముఖ్య అతిథి విశ్రాంత ఉద్యోగి రంగు ధనరాజ్ గౌడ్, నగర సంచాలక్ నూతుల కల్యాణ్‌రెడ్డి, ఇందూర్ విభాగ్ చాలక్ నిమ్మల ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.



ప్రార్థనలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆర్ఎస్ఎస్ సభ్యులు



డీఈవో కార్యాలయంలో సందడి

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సందడి నెలకొంది. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నియామకపత్రాలు అందుకున్న వారంతా గురు, శుక్రవారాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించడంతో అభ్యర్థులంతా ఉరుకులు, పరుగులు పెడుతూ కార్యాలయానికి చేరుకున్నారు. నార్నూర్, గాదిగూడ, బజార్‌హత్నూర్, బోథ్ వంటి దూరప్రాంతాల్లోని అభ్యర్థులు మినహా సమీప ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నవారిలో అత్యధికులు కేటగిరిల వారీగా రిపోర్టు చేయడం కనిపించింది. తాము కోరుకున్న పోస్టులు కాకుండా వేరేవి దక్కినవారితో పాటు విద్యాశాఖ నిర్లక్ష్యంతో దొర్లిన తప్పులతో అవకాశం చేజారిన అభ్యర్థులూ కార్యాలయానికి వచ్చి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. తొలి రోజున రాని వారు శుక్రవారం సాయంత్రం అయిదు గంటల్లోగా డీఈవో కార్యాలయానికి వచ్చి రిపోర్టు చేయాలని ఏడీ నర్సింహులు సూచించారు. వెంట నియామకపత్ర జిరాక్సు ప్రతిని తీసుకురావాలని కోరారు.



పట్టణంలో భారీ వర్షం

ఆదిలాబాద్ పట్టణంలో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఊహించని రీతిలో ఏకధాటిగా దాదాపు గంట పాటు వర్షం కురవడంతో రహదారులపై వెళ్లే వారు తడిసిపోయి తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. వర్షం తెరిపినిచ్చిన అనంతరం మళ్లీ అదే స్థాయిలో ఎండ కాసింది. - న్యూస్‌టుడే, ఎదులాపురం

రూ. 10.50 కోట్ల పనులకు ఆమోదం



- బల్దియాలో బీటీ, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం

48వ వార్డులో ఇళ్ల మధ్యలో నుంచి వెళ్తున్న మురుగు కాలువను రూ.20 లక్షలతో నిర్మించనున్నారు.



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

బల్దియాలో ఏడాది కాలంగా ఎదురు చూస్తున్న టీయూఎఫ్ఐడీసీ(తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన అభివృద్ధి సంస్థ) పథకం కింద చేపట్టనున్న పనులు కొలిక్కి వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఆమోద ముద్ర వేయడంతో రూ. 10.50 కోట్ల విలువైన పనులు పట్టాలెక్కనున్నాయి. పట్టణంలో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, మురుగు కాలువలను నిర్మించేందుకు టెండర్లు పిలవనున్నారు. ఏడాది కిందట రూ. 46.70 కోట్ల విలువైన 49 పనులకు ఆమోదం లభించినా శాసనసభ ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. ప్రభుత్వం మారడంతో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచన మేరకు పాత ప్రతిపాదనలకు కొంత సవరణలు చేసి మరలా పంపాల్సి వచ్చింది. అయితే మొత్తం 46.70 కోట్ల నిధులలో తొలివిడతగా రూ. 5.40 కోట్ల విలువైన 6 పనులకు, రెండో విడతగా రూ. 5.10 కోట్ల విలువైన 13 పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నిధులను రెండు ప్యాకేజీలుగా చేసి టెండర్లు పిలవనున్నారు.



దస్నాపూర్‌లో పాత జాతీయ రహదారి నుంచి పిట్టలవాడ, మావల పోలీస్‌స్టేషన్ మీదుగా వెళ్లే రహదారి కొన్నేళ్లుగా గుంతలు పడి అధ్వానంగా మారింది. తాజాగా రూ.1.95 కోట్లతో బీటీ రోడ్డును నిర్మించనున్నారు.

కొందరిలో ఉత్సాహం.. మిగిలిన వారికి నిరాశ..

బల్దియాలో నిధులు లేక ఏడాది కాలంగా అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనుల ఊసే లేకుండా పోయింది. బల్దియా పాలకవర్గం గడువు మరో మూడు నెలల్లోనే ముగిసిపోనుంది. ఈ నేపథ్యంలో తమ వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైన కౌన్సిలర్లలో హర్షం వ్యక్తమవుతుండగా నిధులు మంజూరు కాని వార్డుల్లో సభ్యులు నిరుత్సాహంలో ఉన్నారు. తాము కౌన్సిలర్ పదవిలో ఉండగానే పనులు ప్రారంభమైతే అదే ఉత్సాహంతో మరోసారి కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తొలుత దాదాపు అన్ని వార్డుల్లో పనులు చేసేలా 49 పనులకు ప్రతిపాదనలు పంపారు. మొత్తం 49 వార్డుల్లో 15 వార్డుల్లోనే అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది. మిగతా వార్డుల్లో పనులు లేక ఆయా కౌన్సిలర్లు నిరాశలో ఉన్నారు.

త్వరలోనే టెండర్

- తిరుపతి, డీఈఈ, బల్దియా

టీయూఎఫ్ఐడీసీ పథకం కింద తొలి విడతగా 6 పనులకు రూ. 5.40కోట్లు, రెండో విడతగా 13 పనులకు రూ. 5.10 కోట్లు మంజూరయ్యాయి. జిల్లా కలెక్టర్ పరిపాలనా ఆమోదం తెలిపారు. త్వరలోనే ఆయా పనులను రెండు ప్యాకేజీలుగా చేసి టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ఎస్ఎన్‌సీయూకు రూ.2.50 లక్షల కేటాయింపు




వెంటిలేటర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఎన్‌సీయూ బాధ్యుడు అనంతరావు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ నియోనిటాల్ కేర్ యూనిట్)కి ఆరోగ్యశ్రీ నిధుల నుంచి రూ. 2.50 లక్షలను రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్ కేటాయించారు. ప్రస్తుతం ప్రసవ విభాగంలో నిరుపయోగంగా ఉన్న వెంటిలేటర్‌ను ఆ విభాగంలో వినియోగించుకోవటానికి సూచించారు. ఎస్ఎన్‌సీయూ కేంద్రంలో సగం వార్మర్లు, వెంటిలేటర్లు పని చేయటం లేదని 'ఈనాడు'లో ఈ నెల 8న ప్రచురితమైన 'పసి ప్రాణాలకు భరోసా కరవు' కథనానికి స్పందించిన డైరెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. పాడైన వార్మర్లు త్వరగా మరమ్మతులు చేయించటానికి ఆదేశించారు.

అపురూపం.. సీతాకోక చిలుకల అందం



ఒక్కటిగా సీతాకోక చిలుకలు


చూడముచ్చటగా..

● బుగ్గ ఆలయ సమీపంలో పార్కు ఏర్పాటుకు చర్యలు

కాసిపేట మండలంలోని ధర్మారావుపేట సెక్షన్ పరిధి బుగ్గ ఆలయం సమీపంలో సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక సీతాకోక చిలుకలను గుర్తించినట్లు చెప్పారు. అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న ఆలయాలు, పురాతన నిర్మాణాల ప్రదేశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలో రంగురంగుల సీతాకోక చిలుకలు కనిపిస్తున్నాయి. ఇక్కడికి వచ్చేవారు వీటిని చూస్తూ మురిసిపోతున్నారు. ఈ విషయమై డిప్యూటీ రేంజర్ ప్రవీణ్‌నాయక్‌ను సంప్రదించగా 'బెల్లంపల్లి మండలంలోని కన్నాల శివారు బుగ్గ ఆలయం రెండు గుట్టల నడుమ 2 వేల ఏళ్ల కిందట వెలిసిందని పూర్వీకులు చెబుతున్నారు. దీన్ని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు అనువైన వనరులు ఉన్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటునకు ప్రణాళిక సిద్ధం చేశాం. త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తాం' అని తెలిపారు. - న్యూస్‌టుడే, కాసిపేట


ఆకట్టుకునేలా..


నీటకుంట వద్ద గుంపులుగా..

మహాగౌరి అవతారం.. పులకించిన భక్తజనం


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు


మహాగౌరి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు మహాగౌరి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొగుటా మాదవనంద సరస్వతీ స్వామి దర్శించుకొని పూజలు చేశారు. ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు వీణ వాయించారు. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్మల్ విద్యార్థులు


విద్యార్థులతో ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్, న్యూస్‌టుడే : అసోం రాష్ట్రంలోని గువహటి త్వరలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్మల్ జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లాలోని బాసర నాగభూషణ విద్యాలయం విద్యార్థులు ఎం.చరణ్, డి.అవినాష్‌లు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచి జాతీయస్థాయిలో పాల్గొననున్నారు. వీరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ ముధుల్కర్, యోగా మాస్టర్ మల్లేశ్, స్కూల్ ప్రిన్సిపల్ బాబురావు వైస్ ప్రిన్సిపల్ సులోచన, నేత్ర వైద్యుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

నేడు నాందేడ్ నుంచి ఆమ్లాకు ప్రత్యేక రైలు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ధమ్మ పరివర్తన దినోత్సవం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని పురస్కరించుకొని శుక్ర, శనివారాలు నాందేడ్-ఆమ్లా-నాందేడ్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ప్రత్యేక రైలు(నెం.07025) నాందేడ్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి ముద్ఖేడ్, భోకర్, హిమాయత్‌నగర్, సహస్రకుండ్, కిన్వట్, ఆదిలాబాద్, పిప్పల్‌కుటి, నాగ్‌పూర్, ఆమ్లాకు శనివారం ఉదయం 11 గంటలకు చేరుకుంటుందన్నారు. శనివారం ప్రత్యేక రైలు(నెం.07026) ఆమ్లా నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో అవే స్టేషన్‌ల ద్వారా ఆదివారం ఉదయం నాందేడ్ చేరుకుంటుందన్నారు. ప్రత్యేక రైలులో 17 జనరల్ బోగీలతో కలిపి మొత్తం 19 కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

అవ్వను అవి అవసరమే..!!

● వృత్తులు.. పద్ధతులు పిల్లలకు తెలిసుండాలి

మామడ, న్యూస్‌టుడే:

చదువుల నిమిత్తం పిల్లలు చిన్నప్పటి నుంచే వసతిగృహాల్లో ఉంటున్నారు. సెలవులొచ్చినా ప్రత్యేక తరగతుల పేరిట అక్కడే ఉండిపోతున్నారు. ఎప్పుడో ఒకప్పుడు సొంతూరుకొచ్చినా తల్లిదండ్రులు పని ఒత్తిడి వల్ల వారితో గడపలేకపోతున్నారు.. అమ్మానాన్నలతో పిల్లలకు ఉండాల్సిన ఆత్మీయతలో అంతరం కనిపిస్తోంది. పండగల వేళ, ఇతర సమయాల్లో ఇంటికొచ్చినప్పుడు వాళ్లతో ఎక్కువ సమయం గడపడం, తల్లిదండ్రుల వృత్తి, ఉద్యోగాలపై అవగాహన కల్పించడం వంటివి ఎంతో అవసరం..

ఇదే కదా ప్రధానమని..

నిర్మల్‌లో నివాసముండే మన్మోహన్‌రెడ్డి స్వగ్రామం సారంగాపూర్ మండలం చించోలి. సొంతూరులో సేంద్రియ, గోఆధారిత వ్యవసాయంలో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. వారికి ఇతర వ్యాపారాలున్నా సాగుకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. తమ ఉన్నతిలో వ్యవసాయానిదే ప్రధాన పాత్ర అని చెప్పే మన్మోహన్‌రెడ్డి సెలవుల్లో కుమారుడు కృషిల్‌రెడ్డిని చేనుకు తీసుకెళ్తారు. సాగు విధానాన్ని చెబుతుంటారు. తోటకు తీసికెళ్లి ఆవులు, ఇతర జీవాలతో సాగుకు ఉన్న అనుబంధాన్ని ఓ పాఠంలా వివరిస్తుంటారు. ఇలా చేయడం వల్ల ఆ చిన్నోడికీ ఇప్పటి నుంచే చేనుచెలకలపై ఆసక్తి పెరిగింది.


చేనులో తండ్రి మన్మోహన్‌రెడ్డితో కృషిల్

ఉల్లాసంగా ఉత్సాహంగా..

మామడ మండలం గాయిద్‌పల్లికి చెందిన రమేష్ రాథోడ్ ఉత్తరాఖండ్‌లోని ఓఎన్‌జీసీ ఫైనాన్స్ విభాగంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు ధనుష్ ఐఐటీ గువహటిలో బీటెక్, కుమార్తె ఈశిత డెహ్రాడూన్‌లో పదో తరగతి చదువుతున్నారు. వీలున్నప్పుడల్లా సొంతూరుకు వెళ్తాం..ప్రకృతిలో గడిపేందుకు ఆసక్తి చూపిస్తాం. మా సంప్రదాయ వస్త్రధారణను పిల్లలు ఇష్టపడేలా చూస్తాం. చేలకు తీసికెళ్లి పంటల సాగుపైనా అవగాహన కల్పిస్తామని తల్లిదండ్రులు రమేష్-రూప సొంతూరిపై మమకారాన్ని, పిల్లలకు మూలాలు తెలియజేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.


సెలవులకు సొంతూరుకొచ్చినప్పుడు పిల్లలతో రమేష్ రాథోడ్-రూప దంపతులు

పనులన్నీ రావాలి కదా..

నిర్మల్ పట్టణం గాయిద్‌పల్లికి చెందిన రవీందర్-నీల దంపతుల పెద్ద కూతురు హిమబిందు ప్రయాగరాజ్ ట్రిపుల్ ఐటీలో, చిన్న కూతురు సింధూజ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి వసతిగృహాల్లో ఉంటున్నారని.. సెలవులకు ఇంటికొస్తే వారి పనులు వారు చేసుకునేలా చూస్తానంటున్నారు తల్లి నీల. వంటలు, ఇతర పనులు నేర్చుకునేలా ప్రోత్సహిస్తుంటామని చెప్పారు. అన్ని పనులు తమకు కూడా ఆనందమే కదా అంటుంటారు ఆ పిల్లలు.



కూతురు సింధూజతో వంట చేయిస్తున్న తల్లి నీల

వృత్తిపై అవగాహన ఉండాలని..


తమ తండ్రులు కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుంటే చూస్తున్న పిల్లలు

మామడ మండలం దిమ్మదుర్తికి చెందిన రేవెల్లి శ్రీనివాస్‌గౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్ వృత్తిరీత్యా గీత కార్మికులు. ఊళ్లోని తాటి చెట్లు గీస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి పిల్లలు అచ్యుత్‌గౌడ్, మనూష హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నారు. దసరా సెలవులకు ఇంటికొచ్చిన ఆ ఇద్దరినీ అలా తాటి వనానికి తీసికెళ్లి నిత్యం వారు చేసే పనిని ప్రత్యక్షంగా చూపించడం, తాతల కాలం నుంచి ఉపాధి ఇస్తున్న ఆ రంగం గురించి వివరించారు. కులవృత్తులు కనుమరుగవుతున్న తరుణంలో ముందుచూపుతో చేసే ఇలాంటి చిన్న పాటి పనులతో వచ్చే తరాలకూ వృత్తి ప్రాధాన్యం తెలిసొస్తుందన్నది వారి అంతరంగం..

ఆలోచించాల్సిన విషయం ఇది..



పరీక్ష పత్రాలను దిద్దుతున్న ఓ ఉపాధ్యాయురాలు ఒక విద్యార్థి రాసిన సమాధానం చూసి కన్నీళ్లు పెట్టుకుంటారు. 'మీరు ఏం కావాలనుకుంటున్నారు' అనే వ్యాసరచన అంశంపై ఓ విద్యార్థి 'నేను స్మార్ట్ ఫోన్ అవ్వాలి అని రాస్తాడు. ఆ విద్యార్థి అమ్మానాన్నలు సెల్‌ఫోన్‌ను చాలా ప్రేమిస్తారు. దానిని శ్రద్ధగా ఇష్టంగా చూసుకుంటారు. నాన్న ఆఫీసు నుంచి వచ్చినప్పుడు స్మార్ట్‌ఫోన్ రిలాక్స్ ఇస్తుంది. ముఖ్యమైన పనుల్లో ఉన్నా ఫోన్ రింగ్ అవ్వగానే జవాబు ఇస్తారు. నేను పిలిచినా పట్టించుకోరు... తల్లిదండ్రులు చరవాణిలో నిమగ్నమై పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నది ఆ వ్యాసంలోని సారాంశం.. ఇది ఎప్పటి నుంచో వైరల్ అవుతోంది. చాలా మంది ఇళ్లలో కనిపించే ఈ అంతరం కనిపిస్తోంది.




కప్పుకొన్న మంచు దుప్పటి

రెండు రోజులుగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం కాస్త ఎండ కాస్తూనే.. మధ్యాహ్నం వర్షం కురుస్తోంది. రాత్రి వేళ చలి ప్రారంభమై తెల్లవారుజామున మంచు కురుస్తోంది. ఆదిలాబాద్ పట్టణాన్ని గురువారం ఉదయం మంచు కమ్మేసింది. - ఈనాడు, ఆదిలాబాద్

ముఖ్యమంత్రిని కలిసి.. సమస్యలు విన్నవించి

ఆసిఫాబాద్, ఉట్నూరు గ్రామీణం న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో నెలకొన్న సమస్యలు, ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరుతూ.. హైదరాబాద్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి వినతిపత్రం అందజేశారు. శాలువా కప్పి సత్కరించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల పరిరక్షణ, చట్టాల అమలు, జైనూర్ ఘటన బాధితురాలి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విన్నవించారు. ఐటీడీఏ ద్వారా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గతంలో మంజూరైన డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్, సీడీపీ పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సత్తు మల్లేష్ తదితరులు ఉన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, చిత్రంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


పొలాలకు సాగునీటినందించే ప్రధాన కాలువ

నిండుగా జలాలు.. కళకళలాడుతున్న పొలాలు

కడెం, న్యూస్‌టుడే :

● 29 టీఎంసీల నీరు గోదావరి పాలు

కడెం నారాయణరెడ్డి జలాశయం ఆయకట్టు పరిధిలోని ఆరు మండలాల రైతులకు కల్పతరువు. కడెం నిండిందంటే ఆ ప్రాంత రైతుల ఆశలు పండినట్లే. కడెం బాగుండాలని, నిండా నీరుండాలని ఆయకట్టు రైతులు కోరుకుంటుంటారు. ఈ వానాకాలం రైతుల కళలు పండేలా ప్రాజెక్టు ఆశాజనకంగా నిండడమే కాకుండా అదనంగా వచ్చిన నీటిని దిగువకు వదిలారు. అక్టోబరు మొదటి వారం ముగిసినా జలాశయంలో గరిష్ఠ మట్టానికి చేరువగా నీటిమట్టం ఉండటంతో వారబందీ నిబంధనలేవీ పెట్టకుండానే అధికారులు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో కాలువలకు సాగునీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 700.7 అడుగుల వద్ద ఉంది. ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కుల వరకు మాత్రమే వస్తోంది.

ఎదుగుతున్న చేలు

కడెం కాలువల ద్వారా పొలాలకు నిరంతరంగా సాగునీరందుతోంది. ప్రాజెక్టు నిండా జలాలు ఉండటంతో చివరి ఆయకట్టు వరకూ నీరందేలా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. మాకు నీరు రాలేదనే ఆరోపణలేమీ లేకుండా రైతుల పొలాలు ఎదుగుతున్నాయి. కాలువల్లో గలగలా నీరు పారుతుంటే పంట పొలాలు కళకళలాడుతూ ఏపుగా ఎదుగుతున్నాయి. ప్రాజెక్టు కింద మొత్తం 60 వేల ఎకరాల పంటలు సాగవుతున్నట్లు అధికారుల అంచనాగా ఉంది. ప్రధాన కాలువకు ఉన్న 42 ఉపకాలువల ద్వారా పొలాలకు సాగునీరందుతోంది. పొలాలన్నీ పొట్ట దశలో ఉండగా మరికొన్ని పొలాలు గొలకలు వేస్తున్నాయి. అక్కడక్కడ తెగుళ్లు సోకిన పొలాలకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకుంటూనే దిగుబడిపై ఆశలు పెంచుకుంటున్నారు.

నాలుగింతల నీరు గోదావరికి..

కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 7.6 టీఎంసీలు. ఈ వర్షాకాలం ప్రారంభం నుంచి కడెంకు మొత్తం 41 టీఎంసీల వరదనీరొచ్చింది. అందులోంచి వరద గేట్ల ద్వారా 29.088 టీఎంసీల నీటిని గోదావరికి వదిలారు. అంటే సుమారు కడెంలో నిల్వ ఉండే నీటికి నాలుగింతల నీరు గోదావరికి వదిలారన్నమాట. కాలువలకు ఇతరత్రా 4.8 టీఎంసీల నీటిని విడుదల చేశారు ప్రస్తుతం కడెంలో 7.511 టీఎంసీల నీరుంది. గతేడాదికంటే ఇపుడు నీటిమట్టం ఆశాజనకంగానే ఉండటంతో వానాకాలం పంట పూర్తయ్యాక రెండో పంటకూ సగం ఆయకట్టుకైనా నీరందుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.


కడెం కింద సాగవుతున్న పొలాలు

విరుల పండగ.. లాభాలు దండిగా..



ఎకరం తోటలో పది టన్నులకు పైగానే..

ప్రకృతిని, పూలను దేవతలుగా కొలుస్తూ పల్లె, పట్నం అనే తేడా లేకుండా.. కొనసాగే పండగ బతుకమ్మ. రంగురంగుల పూలను సేకరించి, బతుకమ్మగా పేర్చి, మహిళలు ఒక చోట చేరి ఆటపాటలతో సాగుతుంది. మరో వైపు వరుసగా దసరా, దీపావళి, ఆ తర్వాత కార్తికమాసం పూజలు, శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో ఈ నెల నుంచి మరో రెండు నెలల పాటు పూలకు డిమాండ్ బాగా ఉంటుంది. బంతి, చామంతి కిలో రూ.100 వరకు ఉన్నాయి. పండగలు, శుభకార్యాలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొంత మంది రైతులు పూలను సాగు చేసి లాభాలను గడిస్తున్నారు. ఇతర రైతులకు భిన్నంగా పూల సాగుకు ప్రత్యేకంగా కొంత భూమిని కేటాయించడంతో పాటు సీజన్ల వారీగా పూలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

పూల తోటలు సాగు చేసే రైతులు లాభాలు గడిస్తున్నారు. ఎకరం భూమిలో బంతి పూల సాగుకు రూ.40 వేలు పెట్టుబడి అవుతుండగా, పది టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. సీజన్‌లో కిలో రూ.100కు పైగా ధర ఉంటుంది. రైతులు రోజు వారీగా పూలు తెంపి స్థానిక మార్కెట్లో విక్రయిస్తే లాభం ఉంటుంది. టోకులో విక్రయిస్తే కిలో ధర రూ.60 ఉంటుంది. డిమాండ్‌ను బట్టి పండగల సమయంలో ధర ఇంకా ఎక్కువే ఉంటుంది. జిల్లాల వారీగా పూలు సాగు చేసే రైతులు తక్కువ సంఖ్యలో ఉండటంతో స్థానిక మార్కెట్లో విక్రయిస్తారు. దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదు.



మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన రైతు శ్రీకాంత్ బంతి పూలు సాగు చేస్తున్నారు. పూల డిమాండ్‌ను బట్టి దిగుబడి వచ్చేలా ప్రణాళిక రూపొందించుకొని సాగు చేయడం వల్ల ఆశించిన లాభాలు గడించే అవకాశం ఉందని తెలిపారు. స్థానిక మార్కెట్లో విక్రయించేలా ఏర్పాట్లు చేసుకొని అధిక లాభం పొందుతున్నారు.

● తక్కువ ఖర్చు.. రోజువారీ ఆదాయం



☛ కుమురం భీం జిల్లా దహెగాం మండలం పి.పి.రావు కాలనీకి చెందిన రైతు సురేష్ మల్చింగ్ పద్ధతిలో పూల సాగు చేస్తున్నాడు. ఎకరం భూమిలో రెండు రకాల బంతి పూలు సాగు చేస్తున్నారు. సరిగ్గా బతుకమ్మ పండగ వచ్చే సరికి దిగుబడి వచ్చేలా చూసుకుంటారు. ఎకరానికి పది టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. పూలను విక్రయించడానికి ఎక్కడికి వెళ్లే అవసరం లేదు. తోట దగ్గరికే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారని వివరించారు.



☛ ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారికి చెందిన రైతు దేవిదాస్ తనకు ఉన్న భూమిలో రెండు ఎకరాల్లో కూరగాయలు, పూలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ పండగ సమయంలో పూలకు ఎక్కువ డిమాండ్ ఉండటం, పైగా ఆదిలాబాద్ జిల్లాలో ఈ పండగ నెల రోజులు కొనసాగుతుంది. డిమాండ్‌కు తగ్గట్టుగా దిగుబడి వచ్చేలా వారం రోజుల తేడాతో విత్తుకోవడంతో రోజు వారీగా పూల విక్రయాలుండటంతో లాభాలు గడించే అవకాశం ఉందని దేవిదాస్ తెలిపారు.



☛ నిర్మల్ జిల్లా బాసర మండలం బిద్రెల్లికి చెందిన ఆర్.మహేశ్ ఎకరం భూమిలో పూలు సాగు చేస్తున్నాడు. బతుకమ్మ పండగ సమయానికి బంతిపూలు వచ్చేలా జూన్ నెలలో పంట సాగును ప్రారంభిస్తే.. సెప్టెంబరు నుంచి దిగుబడి మొదలవుతుందని తెలిపారు. చాలా మంది చేను దగ్గరికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతుంటారని, ఎక్కువ దిగుబడి వస్తే.. నిజామాబాద్ మార్కెట్లో విక్రయిస్తామని ఆయన తెలిపారు.



ఉమ్మడి జిల్లాలో పూల సాగు(ఎకరాల్లో)			
బంతి : 258	చామంతి : 115	మల్లె : 68	లిల్లి : 52

అల్లుడి మరణం తట్టుకోలేక.. అత్త హఠాన్మరణం


వచ్చలబాయి

భీంపూర్, న్యూస్‌టుడే : రెండు రోజుల కిందటే అల్లుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఆ మరణం తట్టుకోలేక అత్త హఠాన్మరణం చెందిన ఘటన కరంజి-టిలో విషాదం నింపింది. రెండు రోజుల వ్యవధిలో ఒకే ఇంట ఇద్దరు చనిపోవడంతో ఆ కుటుంబంలో తీరని శోకం నిండింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గ్రామానికి చెందిన కర్నెవార్ గణేష్ మంగళవారం మృతి చెందిన సంగతి తెలిసిందే. భార్య కవిత తల్లి వచ్చలబాయి(75) భర్త చనిపోవడంతో ఏళ్లుగా కూతురు-అల్లుడి ఇంట్లో ఉంటోంది. అల్లుడి మరణంతో కూతురు, ఆమె పిల్లల భవితవ్యంఎలాగోనని రెండు రోజులుగా రోధిస్తోంది. గురువారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కూర్చున్న చోటనే కుప్పకూలి చనిపోయింది.

ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా ఛైర్మన్‌గా శేఖర్



నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఛైర్మన్‌గా నిర్మల్ పట్టణానికి చెందిన కొట్టె శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయాలకు అతీతంగా అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘ బలోపేతానికి కృషిచేస్తానని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.


రికార్డుల నిల్వ గదిని పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

పోలీస్ స్టేషన్ తనిఖీ

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉట్నూరు డీఎస్పీ నాగేందర్, సీఐ భీమేష్, ఎస్సై ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బేల, న్యూస్‌టుడే : బేల మండలం మాంగ్రూడ్‌కు చెందిన వాంకడే జితేందర్(19) బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. గ్రామస్థులు వివరాల ప్రకారం.. జితేందర్ బుధవారం రాత్రి తన బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రలోని కేలాపూర్ జగదాంబ మాత దర్శనానికి వెళ్లాడు. అక్కడి నుంచి పాండ్రకవడ వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో జితేందర్ అక్కడికక్కడే చనిపోయాడు. మరొకరు గాయపడ్డారు. మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చేతికొచ్చిన కొడుకు రహదారి ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.


జితేందర్

ఉరేసుకొని ఒకరి బలవన్మరణం

బోథ్, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఒకరు బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. బోథ్‌కు చెందిన తలారి భూమన్న(52) భార్య నాలుగు సంవత్సరాల కిందట మృతి చెందింది. సదరు వ్యక్తి ఒంటరిగా దీకొండ రాజన్న ఇంట్లో అద్దెకు ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య చనిపోవటంతో ఇంట్లో సహాయపడే వారు ఎవరూ లేరని మనస్తాపానికి గురై గురువారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. అతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వివాహిత...

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో వివాహిత ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. కాలనీలో నివాసం ఉండే సుల్తానా బేగం(47) కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. బుధవారం రాత్రి భోజనాలు అయ్యాక రాత్రి భార్య, భర్తలు పడుకున్నారు. భర్త అబ్దుల్ హకీం గురువారం ఉదయం లేచి చూసేప్పటికి ఆమె ఉరేసుకొని కనిపించింది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. కుమారుడు అబ్దుల్ నజీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మందుల దుకాణాలు తనిఖీ

జైనథ్, న్యూస్‌టుడే: జైనథ్ మండల కేంద్రంలోని రుద్ర, శ్రీనివాస మందుల దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆడె శ్రీలత గురువారం తనిఖీ చేశారు. రుద్ర మందుల దుకాణంలో ఫార్మాసిస్టు లేకపోవడంతో పాటు షెడ్యూల్ హెచ్ 1 రిజిస్టర్ నిర్వహించకపోవడంతో దుకాణాదారుడికి నోటీసులు అందజేశారు. శ్రీనివాస మందుల దుకాణంలో కొనుగోలు, అమ్మకపు బిల్లులు చేపట్టకపోవడంతో నోటీసులు జారీ చేశారు.

జూదరుల అరెస్టు

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లోని మార్కండేయ కాలనీలో జూదమాడుతున్నారన్న ముందస్తు సమాచారంతో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎస్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు స్థావరంపై దాడి చేశారు. అయిదుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

డిగ్రీ అధ్యాపకుడికి ఆర్మీ లెఫ్టినెంట్ హోదా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ బాధ్యతలు చూస్తున్న రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు పుట్ట లక్ష్మణ్‌కు ఆర్మీ లెఫ్టినెంటు హోదా లభించింది. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో జరిగిన అవుట్ పరేడ్‌లో ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ మేజర్ జనరల్ కపిల్‌జిత్ సింగ్ రాథోడ్ నుంచి లెఫ్టినెంట్ హోదాను స్వీకరించారు. 32 బెటాలియన్ ఆదిలాబాద్ లెఫ్టినెంట్ కర్నల్ వికాస్‌ర్గ, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


పుట్ట లక్ష్మణ్

అదనపు పీపీకి సన్మానం

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఫ్యామిలీ కోర్టు అదనపు పీపీగా నియమితులైన మేకల మధుకర్‌ను న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో సత్కరించారు. న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు, కార్యదర్శులు చంద్రహాస్, ఉమేష్‌రావు, న్యాయవాదులు ఆకుల శోభ, దేవేందర్, సంతోష్, రమేష్, శ్రీకాంత్, చంద్రశేఖర్, న్యాయవాద పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

శ్యామ్‌నాయక్ జన్మదిన వేడుకలు

నార్నూర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు లోఖండే దేవ్‌రావు కేక్ కోసి స్వీట్లు పంపిణీ చేశారు. చవాన్ ప్రకాశ్, ఆడే దిగాంబర్, వసంత్ ఆడే, చవాన్ గోవింద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు చూపించాలి

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 నియామక కౌన్సెలింగ్‌లో బదిలీ అయిన రిలీవ్‌కాని ఉపాధ్యాయుల ఖాళీలను తప్పక చూపించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ పేర్కొన్నారు. గురువారం సంఘ బాధ్యులతో కలిసి డీఈవో కార్యాలయ సహాయ సంచాలకునికి వినతిపత్రం అందజేశారు. గతంలో బదిలీ అయిన రిలీవ్‌కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానాలను చూపించాలన్నారు. డీఎస్సీ -2024 ఎంపిక జాబితాలో దొర్లిన తప్పులను సవరించి అర్హులకు న్యాయం చేయాలని విన్నవించారు. నాయకులు వినోద్‌రెడ్డి, జక్కుల శ్రీనివాస్, ఆరె బాబురావ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జోగురామన్న విరాళం

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని 28వ వార్డు పరిధిలోకి వచ్చే ఎస్సీ కాలనీలో ప్రతిష్ఠించిన శారదాదేవి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి మాజీ మంత్రి జోగురామన్న రూ.10వేలు విరాళంగా అందించారు.


మొక్కుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


బోథ్ : దుర్గామాత వద్ద హోమం నిర్వహిస్తున్న గ్రామస్థులు


చప్రాలలో కుంకుమార్చనలో భక్తులు

పూజలు.. కుంకుమార్చనలు


తలమడుగులో బోనాలతో శోభాయాత్ర

ఆదిలాబాద్ సాంస్కృతికం, తాంసి, బేల, తలమడుగు, తలమడుగు, ఇచ్చోడ(నేరడిగొండ), బోథ్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా గురువారం దుర్గా నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండపాల వద్ద మహిళలు కుంకుమార్చన చేపట్టారు. భక్తులు హోమం నిర్వహించారు. తలమడుగులో మహిళలు బోనాలతో శోభాయాత్ర చేపట్టారు.


ఆదిలాబాద్‌లో..

సోయా పరిమితి పెంపునకు మంత్రి తుమ్మల హామీ

★ మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే శంకర్

జైనథ్, బేల, న్యూస్‌టుడే : సోయా కొనుగోలు కేంద్రాల్లో ఎకరానికి 10 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వినతి మేరకు సోయా పరిమితి పెంపునకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హామీ ఇచ్చారు. జైనథ్ మార్కెట్‌యార్డులో గురువారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా సోయా కొనుగోళ్లు ప్రారంభించేందుకు వచ్చిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రైతుల కోరిక మేరకు వారి సమక్షంలో మంత్రి తుమ్మలతో ఫోన్‌లో మాట్లాడారు. నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. బేల ఉప మార్కెట్‌లో ఛైర్మన్ అశోక్‌రెడ్డితో కలిసి కొనుగోళ్లను ప్రారంభించారు.


జైనథ్‌లో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

మార్కెట్ యార్డులో రైతుల కోసం పాయల్ ఫౌండేషన్ తరపున అన్నదానం ఏర్పాటు చేస్తానన్నారు. డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ విలాస్, మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి (డీసీవో) మోహన్, మార్కెట్ కార్యదర్శి మధుకర్, సొసైటీ కార్యదర్శి గంగన్న, భాజపా, కాంగ్రెస్, భారాస నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

జైనథ్: జైనథ్ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు జైనథ్ గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గురువారం ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకుడు ధీరజ్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే శంకర్‌ను గ్రామస్థులు సన్మానించి స్వామి వారి ప్రతిమను అందజేశారు. కోనేరు చెత్తాచెదారంతో కనిపిస్తోందని, ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు.


కుటుంబ డిజిటల్ కార్డు వివరాల ఆన్‌లైన్ నమోదును ఆరా తీస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కుటుంబీకుల చిత్రాలను పొందుపర్చండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం సర్వేలో సేకరించిన వివరాలతో పాటు కుటుంబీకుల చిత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం బల్దియా కార్యాలయాన్ని పరిశీలించారు. సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు తీరును డేటా ఎంట్రీ ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. పొరపాట్లకు తావివ్వకుండా వివరాలను పొందుపర్చాలని సూచించారు. ఆర్డీఓ వినోద్ కుమార్, పుర కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, ఈడీఎం రవీందర్, బల్దియా సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ అబద్ధాలే : రామన్న

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : రైతు రుణమాఫీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చెబుతున్నవన్నీ అబద్ధాలేనని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న విమర్శించారు. ఆదిలాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ప్రహ్లాద్, రమేష్‌రెడ్డి, రమేష్, లింగారెడ్డి, గోవర్ధన్, పరమేశ్వర్, దేవన్న, ఊషన్న, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీలపై కదలిక

★ ప్రభుత్వ చర్యలతో చిగురిస్తున్న ఆశలు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు తిరిగి స్వస్థలాలకు ఎప్పుడు వస్తామని ఎదురుచూస్తున్నారు. జిల్లాలో పని చేస్తున్న 18 మందికి స్థానచలనం కల్పిస్తూ నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆయా జిల్లాల్లో పనిచేస్తున్న వారు ఇక్కడకు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తిరిగి స్వస్థలాలకు తిరిగి వస్తామని భావించిన వారికి నిరాశ తప్పలేదు. భార్య, పిల్లలు ఒకచోట.. తాము మరోచోట ఉండటంతో బదిలీ కోసం ఏడాదిగా నిరీక్షిస్తున్నారు. భూపరిపాలన విభాగ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ గురువారం జారీచేసిన ఉత్తర్వులు వారిలో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

జిల్లాలో 18 మండలాలు ఉండగా.. కలెక్టరేట్‌లో పని చేస్తున్న వారిని కలుపుకొని 23 మంది తహసీల్దార్లు ఉండగా. ఇందులో మండలాల్లో పని చేస్తున్న 18 మందిని ఇతర జిల్లాలకు కిందటి ఆగస్టు 2న బదిలీ అయ్యారు. ఇందులో తొమ్మిది మందిని నిర్మల్ జిల్లాకు, మరో తొమ్మిది మందిని మంచిర్యాల జిల్లాకు కేటాయించారు. జిల్లాకు కొత్తగా మంచిర్యాల నుంచి ఏడుగురు తహసీల్దార్లు, నిజామాబాద్ జిల్లా నుంచి ఇద్దరు, నిర్మల్ జిల్లా నుంచి తొమ్మిది మంది తహసీల్దార్లు బదిలీపై ఇక్కడకు వచ్చారు. బదిలీ అయిన ఆరు మాసాల్లో తిరిగి తమ తమ జిల్లాలకు వెళ్తామనే ఉద్దేశంతో తహసీల్దార్లు భావించగా.. ప్రభుత్వం వారిని కదపలేదు. ఇటీవల తహసీల్దార్లతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించగా.. ఆ సమయంలో తమను బదిలీ చేయాలని తహసీల్దార్లు విన్నవించారు. వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. ఫలితంగా తాజాగా ఉత్తర్వులు జారీచేయడంతో తహసీల్దార్లలో తిరిగి తమ జిల్లాలకు చేరుకుంటామనే భరోసా కనిపిస్తోంది.

ఆడపడుచుల తులం బంగారం ఏమైంది?: ఎమ్మెల్యే

తలమడుగు, న్యూస్‌టుడే : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పిందని.. ఆ హామీ ఏమైందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. త్వరగా ఆడపడుచులకు తులం బంగారం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం తలమడుగు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అక్కడి నుంచి తలమడుగు, కొత్తూర్ గ్రామాల్లోని దుర్గామాతలను దర్శించుకుని పూజలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో చంద్రశేఖర్, భారాస నేతలు వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, రవికాంత్ యాదవ్, వెంకటేష్, కిరణ్, అబ్దుల్లా, కేదారేశ్వర్‌రెడ్డి, గంగాధర్, మల్లేష్, రంజిత్‌రెడ్డి, సునీతరెడ్డి, పల్లవి, సుదర్శన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఆనంద్, ప్రసూన్ రెడ్డి, నారాయణరెడ్డి, నవీన్‌రెడ్డి, కట్కం దేవన్న పాల్గొన్నారు.


తలమడుగులో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

కళ్లను కాపాడుకోవాలి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరు కళ్లను కాపాడుకోవాలని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర ఆసుపత్రి వైద్యులు విలాస్, శ్యామ్‌లు అన్నారు. గురువారం ఇంద్రవెల్లి మండలం అంజిలో ప్రపంచ కంటి చూపు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. నేత్ర పరీక్షలు నిర్వహించి ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముకాడే ఉత్తం, గ్రామ పటేల్ దశరథ్ గారులేతో పాటు గ్రామస్థులు, ఆశా కార్యకర్త లలిత పాల్గొన్నారు.

మాలీ సంఘం జెండా పండగ

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : మాలీ సంఘం జెండా పండగ వారోత్సవాలను గురువారం జ్యోతిబాపులే విశ్రాంతి భవనంలో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే జ్యోతిబాపులే, సావిత్రిబాయి దంపతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. మాలీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని, తమకు ఎస్టీ హోదా కల్పించాలనే బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని కోరారు. సంఘం నాయకులు సాంబన్న, చంద్రశేఖర్, అనిల్, శ్రీను, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఎన్నిక

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగభూషణ్, ఉపాధ్యక్షులు వినాయక్, సంతోష్, కోశాధికారిగా వినీల్‌కుమార్, రమణలను ఎన్నుకున్నారు.

మూడు నెలల చిన్నారికి శస్త్ర చికిత్స

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ పట్టణం డాక్టర్స్ లేన్‌లోని స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మూడు నెలల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు వైద్యులు తెలిపారు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే కిడ్నీలో సమస్య మొదలైంది. ప్రసవం తర్వాత సమస్య మరింత పెరిగింది. నొప్పిని తట్టుకోలేక ఆ చిన్నారి ఏడుస్తూనే ఉండటంతో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెరకు చెందిన పూజిత - ప్రవీణ్ దంపతులు నిర్మల్‌లోని సదరు హాస్పిటల్‌కు తీసుకురావడంతో వైద్యులు పరీక్షలు చేశారు. బాబుకు కిడ్నీ, మూత్రనాళం మధ్యలో పీయూజే (పెల్వి యూరెటర్ జంక్షన్) దగ్గర వాపుతో బాధపడుతున్నట్లు గుర్తించారు. చిన్న పిల్లల శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ లీలాకుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ నాలం శశికాంత్, కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ మల్లేశ్, తదితరులు ఆ చిన్నారికి శస్త్ర చికిత్స చేశారు. ఆపరేషన్ తర్వాత ఆ బాబు కోలుకోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.


రిమ్స్‌లో పూజలు చేస్తున్న సంచాలకుడు జైసింగ్ రాథోడ్

ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఆదిలాబాద్ నేర విభాగం, ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ బల్దియాలో అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొని ఆడిపాడారు. రిమ్స్‌లోనూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.


బల్దియా అధికారులు, మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు


ఉట్నూరు సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌ను సన్మానిస్తున్న లంబాడ జేఏసీ నాయకులు

సమస్యలు పరిష్కరించండి

ఉట్నూరు న్యూస్‌టుడే : ఏజెన్సీలోని లంబాడీల అభివృద్ధికి కృషి చేయాలని ఉట్నూరు సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌ను లంబాడ జేఏసీ నాయకులు జగన్ నాయక్, రెడ్డి నాయక్ కోరారు. గురువారం ఉట్నూరులో ఆయనను కలిసి సన్మానించారు. తండాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు భరత్ చౌహాన్, గణేష్ రాథోడ్, పవార్ దేవిదాస్, నేతావత్ రాందాస్, రాథోడ్ ప్రవీణ్, ఆడె సురేష్ సుధాకర్ నాయక్, గంగారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతో బడుగులకు ఉన్నతి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంతోనే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయన్న కాన్షీరాం సిద్ధాంతం కోసం ఉద్యమించాలని దళితశక్తి ప్రోగ్రాం జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. గురువారం కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తరప్రదేశ్‌లో అట్టడుగు వర్గాలను ఏకం చేసిన మహనీయుడు కాన్షీరాం అన్నారు. నవంబరు 3న హైదరాబాదులో జరిగే పార్టీ కార్యకర్తల మహా సమ్మేళన కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. పార్టీ నాయకులు గంగన్న, నవీన్ కుమార్, సాయికుమార్, విను కుమార్, సతీష్ తదితరులున్నారు.



టూటౌన్ కానిస్టేబుల్ రజితకు నగదును అందజేస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

బతుకమ్మ వేడుకల్లో టూటౌన్‌కు మొదటి బహుమతి

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : పోలీసు శాఖ తరపున ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్‌కు మొదటి బహుమతి దక్కింది. రెండో బహుమతి మావల పీఎస్‌కు, మూడో బహుమతి వన్‌టౌన్ పోలీసులకు దక్కింది. ఎస్పీ గౌష్ ఆలం మొదటి బహుమతిని టూటౌన్‌కు అందించారు. మహిళా కానిస్టేబుల్ రజితకు డీఎస్పీ జీవన్‌రెడ్డి నగదు రివార్డును అందించి అభినందించారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియామకం

బోథ్, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడిగా బోథ్‌కు చెందిన ఉపాధ్యాయుడు రావుల శంకర్ గురువారం నియామకమయ్యారు. రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఉత్తర్వులను జారీ చేశారు.


పాదయాత్ర ప్రచార ప్రతులను విడుదల చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

ఆదిలాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో పాలుపంచుకున్న ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఛలో ఉస్మానియా యూనివర్సిటీ పాదయాత్ర ప్రచార ప్రతులను విడుదల చేశారు. కిరణ్, కిషన్, విఠల్, శ్రీనివాస్, ఆంజనేయులు, రఫీక్, శ్రీనివాస్, ఉమా మహేశ్వరి, జ్యోతి, రమ పాల్గొన్నారు.

మార్పులను ఆస్వాదించాలి

ఎదులాపురం, న్యూస్‌టుడే : కాలానుగుణంగా వచ్చే అన్ని రకాల మార్పులను స్వీకరిస్తూ ఆస్వాదించినప్పుడే మనిషి ప్రశాంతంగా జీవించగలుగుతాడని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. డీఎల్‌ఎస్‌కే ఆధ్వర్యంలో కోర్టుల ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో గురువారం 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం'ను పురస్కరించుకొని సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరోగ్యంగా ఉండటానికి, మానసిక ఒత్తిడిని అధిగమించటానికి మంచి మిత్రులను కలిగి ఉండాలని సూచించారు. న్యాయమూర్తులు ప్రమీలా జైన్, సూర్యవార్ మంజుల, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

మానసిక ఒత్తిడిని అధిగమిస్తేనే ఆరోగ్యకర జీవితం

ఆదిలాబాద్ వైద్య విభాగం: ప్రతి మనిషి మానసిక ఒత్తిడిని అధిగమించినప్పుడే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపగలుగుతాడని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ అధికారి మిట్పల్లివార్ శ్రీధర్ సూచించారు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం'ను పురస్కరించుకొని గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో మానసిక ఒత్తిడి నుంచి ఎలా బయటపడాలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించి హెల్ప్ లైన్ కరపత్రాలను ఆవిష్కరించారు. 14416కు ఫోన్ చేస్తే పరిష్కార మార్గాలు సూచిస్తారన్నాను. డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, డీఐఓ వైసీ శ్రీనివాస్, గణాంకాధికారి బ్రహ్మానందరెడ్డి, డెమో వెంకటరెడ్డి, సైకాలజిస్ట్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


డోప్టాలలో తడిసిన సోయాను ఆరబెడుతున్న రైతు


ద్విచక్ర వాహనాన్ని వాగు దాటిస్తున్న రాజులగూడవాసులు

భారీ వర్షం.. పంటలకు నష్టం

బేల, ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : బేల మండలంలో గురువారం మధ్యాహ్నం గంట పాటు కురిసిన భారీ వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన సోయా కోత సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లోనే సోయా, పత్తి పంట తడిసిపోయింది. ఉట్నూరు మండలం రాజులగూడలో వాగు పొంగి గర్భిణులు ఇబ్బందులు పడ్డారు. కొందరు ద్విచక్ర వాహనాలను ఎత్తుకొని వాగు దాటించారు.

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లిలో గురువారం మధ్యాహ్నం వర్షం కురిసింది. వర్షం కురవడంతో కొంత మంది రైతులు హర్షం వ్యక్తం చేయగా.. మరికొందరు పంట దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.


ఇంద్రవెల్లిలో కురుస్తున్న వర్షం